# కానుక

వి.పద్మ

అప్పటి వరకూ వీధి గుమ్మంలోనే నిలబడి ఆయన రాక కోసం కాళ్ళు అరిగేలాగా నిలబడ్డాను నేను, తీరా ఆయనను చూడగానే - వట్టి చేతులతో వస్తున్న ఆయనను చూడగానే - చివ్వుమని కోపంగా వెనుదిరిగి, రివ్వుమంటూ లోపలికి వరుగెత్తి, భగభగా మండుతూన్న హృదయంతో అలకపాన్పు ఎక్కేశాను.

అప్పటికే నా ముఖంలోకి మార్పు కనిపెట్టేసిన ఆయన "లల్లీ? ఏమిటి, అలా ఉన్నావ్?" అంటూ నా భుజంమీద చెయ్యివేసి లాలనగా అడిగారు.

హుఁ - లల్లీ అట! పైకి మాత్రం ప్రేము న్నట్లుగా నటన! 'అనలు' విషయానికి వస్తే తోక ముడుస్తారు?' అనుకున్నాను నాలో నేను కోపంగా. పైకిమాత్రం ఆయనకు సమాధానం చెప్పకుండా ఆయన చేతిని విదిల్చికొట్టాను.

కాస్సేపు నన్ను బ్రతిమలాడి, విసిగిపోయిన ఆయన ఇహ లాభంలేదు అనుకున్నారో ఏమో మరి? ఉసూరుమని నిట్టూర్చి గది బయటకు వెళ్ళిపోవడం కళ్ళు మునుకుని అటు తిరిగి వడుకున్న నాకు బాగానే తెలిసింది.

నేను ఎందుకు అలిగానో ఆయనకు తెలును. ఆయనకు తెలుసునని నాకూ తెలును. కారణం తెలిసికూడా 'ఎందుకు అలిగావు?' అని అడగడంలోనే తెలిసిపోతుంది ఆయన గడసరితనం.

ఈరోజు తారీఖు ఏమిటో, రేపటి ప్రత్యేకత ఏమిటో నిమిషానికి ఒకసారి వాచీ చూసుకునే అలవాటున్న ఆయనకు తెలిసినంతగా మరెవ్వరికీ తెలియదు.

హుఁ - నంవత్సరానికి ఒక్కసారి వస్తుంది ఎవరికైనా పుట్టినరోజు. పెళ్ళి కాకముందు పుట్టింట్లో ఉన్నంతకాలం పుట్టినరోజునాడు పొద్దున్నే తలంటుకుని, కొత్తచీర కట్టుకుని, దేవుడికి దండం పెట్టేవరకూ వదిలేది కాదు అమ్మ.

పెళ్ళయింది. మొదటి రెండేళ్ళూ - కొత్తపెళ్ళాం అనే మోజుతో కొంత, కొనకపోతే ఏమైనా అనుకోగలననే మొహమాటంతో కొంత - కొత్తచీర కొనిపెట్టారు.

ఆ తర్వాత వరుసగా పాప, బాబు పుట్టుకు వచ్చారు. అంతే? అప్పటితో నిండిపోయాయి నా పుట్టినరోజు నంబరానికి నూరేళ్ళూ.

పెళ్ళయిన కొత్తల్లో, కొత్తచీర కట్టుకుని అలంకరించుకుంటే, "అబ్బో! ఎంత అందంగా ఉన్నావోయ్!" అంటూ దగ్గరకు తీసుకునే ఈయనే, ఇప్పుడు కొత్తచీర కావాలి, అంటే చాలు, ముఖం చాటేస్తున్నారు.

హుఁ - అదే మా అన్నలు అయితేనా? పెళ్ళయి ఇన్నేళ్ళయినా ఇప్పటికీ వదినలకి పుట్టినరోజు వస్తే చాలు - మంచి చీరలు కొనిపెడతారు. అందుకే అన్నారు - పుణ్యంకొద్దీ పురుషుడు అని.

మళ్ళీ ఆయన అడుగుల శబ్దం వినపడుతుందేమో అని చాలాసేపు ఎదురుచూసిన నేను ఆశలన్నీ నిరాశగా మారగా, వంటగదిలోని ఖాళీ వంటపాత్రలు నేటికీ పొయ్యిమీద పిల్లి కూర్చోవలసిందేనా? అని నిలదీస్తున్నట్లుగా అనిపించడంతో, ఉస్సురని 'ఈ జీవితానికి ఇంతే భాగ్యం!' అని నిట్టూర్చి లేచి, చెదరిన జుట్టును వేళ్ళతోనే సరిచేసుకుంటూ వంటగది వైపు నడిచాను.

ఆ రాత్రికి నేనూ, ఆయనా ఎడమొహం - పెడమొహంగానే గడిపాం. ఒకే మంచంమీద అటు ముఖం తిప్పి ఆయనా - ఇటు ముఖం తిప్పి నేనూ - రెండు విభిన్న రేఖలను కలిపి ఒకే దిశవైపు పయనించమన్నట్లుగా - ఇద్దరం కలసి నడుపుతున్నాం. ఏమాత్రం ఆసక్తి, ఉత్సాహం లేని ఆ రాత్రిని.

'ఆ మాత్రం చీర కొనిపెట్టలేరా' - అని నేనూ, ఆమాత్రం భర్త మనస్సుని అర్థం చేసుకోని భార్యవి - నువ్వేం భార్యవి' అంటూ ఆయనా ఇద్దరం ఇలా అప్పుడప్పుడూ పంతం పట్టడం మామూలే?

ఎప్పటికప్పుడే నేను మొండికేసినా - మళ్ళీ వెంటనే అనిపిస్తుంది - అమ్మో! ఈ పంతాల వాన ఎప్పుడు వెలుస్తుంది? అసలు వెలుస్తుందా? లేక తుపానుగా మారుతుందా? గుండెల్లో ఏదో భయం.

ఆయనకీ అలాగే అనిపిస్తుందట. కోపం తగ్గి ఇద్దరం ఒక జట్టు అయ్యాక చెప్పేవారు.

పిచ్చి కాకపోతే - పొద్దు తిరుగుడు పువ్వు చూస్తుందని ఉదయించకుండా సూర్యుడు - ఉదయించిన సూర్యుడి దిక్కు తిరగకుండా పొద్దుతిరుగుడు పువ్వు - ఎంతసేపని ఒకరిని ఒకరు చూసుకోకుండా ఉండగలవు?

ఇద్దరం అలిగిన ఆ కాస్సేపూ మాత్రం - తుఫాను వాతావరణం మా ఇంట్లోనూ, ఒంట్లోనూ ఆవరించుకొని ఉంటుంది.

ప్రస్తుతం నా కళ్ళముందు - పదిరోజుల క్రితం పక్కింటి ఆవిడతో కలసి 'కుమరన్స్'లో చూసిన పింక్ కలర్ జరీ కోటా చీర మెదులుతోంది. నాజూకైన ఆ చీరె అందం, కొనిపించుకోగల సందర్భం వచ్చిందిగదా, అవకాశం దేనికి వదులుకోవడం అంటూ మురిపిస్తోంది?


'ఈ పదిరోజులు మనస్సులోనే ఆ చీరను ధరించినట్లుగా భావించి, తీయటి కలలలో విహరించిన నాకు - ఆయన 'చీర కొనను' అని మొండికేయడంతో - నానుంచి దూరం కాబోతున్న ఆ చీర తాలూకు విరహం రేపిన బాధ నాలో క్షణక్షణానికీ కోపాన్ని పెంచేస్తోంది. అందుకే ఈ కోపం.

బెడ్‌రూమ్ నిండా ఏర్పరచుకున్న నిరాశలాంటి కాంతి, కిటికీలోనుంచి తొంగి చూస్తున్న గాలి ఆడక ఉక్కిరిబిక్కిరి అవుతున్నట్లున్న చెట్లు, ఆకాశంలో వాటినే నిర్లిప్తంగా చూస్తున్న చందమామ, నిద్రపట్టక అస్తిమితంగా పక్కలో కదులుతూన్న ఈ యనా, దిగులుగా వీటినన్నింటినీ గమనిస్తూ నాకు పట్టింది నిద్ర ఏ జాముకో.

లేచేసరికి కిటికీలోనుంచి తీక్షణమైన కిరణాలను ప్రసరిస్తూ ఉత్సాహంగా డ్యూటీలో చేరిన సూర్యుడు హుషారుగా పలకరిస్తున్నాడు, 'హలో' అంటూ.

నేను లేచి, డైనింగ్ రూమ్‌లోకి వచ్చేసరికి అప్పటికే పాలు కాచి, పిల్లలకి చెరొక గ్లాసుతో పాలు ఇచ్చి, తనూ కాఫీ తాగుతున్న శ్రీవారు నన్ను చూడగానే, "పిల్లలూ మీఅమ్మ దేనికో అలిగింది తెలుసా?" అన్నారు ఓరగా నన్ను చూస్తూ.

"తెలియదు డాడీ, అఫ్‌కోర్స్, నిన్న అమ్మకొంచెం 'డల్'గా ఉండడం నేనూ అబ్జర్వ్ చేశాననుకో, బట్, ఎందుకోలే అనుకుని



ఊరుకున్నాను" అన్నాడు మావాడు ఉత్సాహంగా.

"పోరా ఫూల్/" అంటూ వాడిని విసుక్కున్న మా పాప, "ఎస్ డాడీ? నిన్నటినుంచి అమ్మ అదోలా ఉంది. ఎందుకని డాడీ? అంది.

"ఇవాళ మీ అమ్మ పుట్టినరోజు చీర కొనలేదని" అన్నారు మావారు.

"పూర్ మమ్మీ? పాపం మనకోసం రోజూ ఎంత శ్రమపడుతోంది, చీర కొనివ్వండి డాడీ?" అంది మా పాప వెంటనే.

"అంతేనంటారా?" అన్నారు ఈయన బాబువైపు చూస్తూ

"కొనివ్వండి, డాడీ? రోజూ ఎంతడబ్బు ఖర్చుకావడంలేదు? అందులో ఇదొకటి" అన్నాడు ఆరిందలా.

"అసలు - ఈరోజు ఎందుకు కొనలేదు డాడీ?" అంటూ పాప ఆరాతీసింది.

"అదికాదు బేబీ, ఇది జూన్ నెల. మీ స్కూలు పుస్తకాలకూ, ఫీజులకూ, యూనిఫారాలకే చాలా ఖర్చయిపోయింది. ఇప్పుడు చీర కొనాలంటే అది నా తలకు మించిన భారం. ఆ సంగతి మీ అమ్మ ఎందుకు అర్థం చేసుకోదు" అన్నారు ఈయనే బాధగా.

"పోనీలెండి డాడీ? పాపం అమ్మకోరింది ఒక్క చీరేకదా? ఫ్రెండ్స్ వాళ్ళ అమ్మలయితే నగలు కొనమని ఎప్పుడూ వాళ్ళ హస్‌బెండ్స్‌ని పీడిస్తూ ఉంటారట. మా ఫ్రెండ్స్ ఎప్పుడూ చెబుతూంటారు. మన అమ్మ మిగతావాళ్ళ అమ్మలకంటే చాలా బెటర్ డాడీ" అంది కాన్వెంట్‌లో టెన్త్ స్టాండర్డ్ చదువుతున్న మా పాప.

"అవును డాడీ, ప్లీజ్ .. కొనివ్వండి" అంటూ సపోర్ట్ చేశాడు బాబు.

"సరే అయితే" అన్నారు మా వారు.

అప్పటివరకూ గది గుమ్మందగ్గరే నిలబడి సంభాషణ ఆలకించిన నేను, వంటగదిలోకి వెళ్ళిపోయాను.

నా వెనకాలే ఎప్పుడు వచ్చారో మరి, ఆయన ప్రేమగా నా భుజంమీద చెయ్యి వేసి, "సారి లల్లీ? నిన్ను చాలా బాధపెట్టాను. త్వరగా రెడీ అవు. ఇవాళ నీకు చీర కొనిపెట్టి ఆఫీసుకు వెళతాను" అన్నారు.

"నాకేం అక్కర్లేదు" అన్నాను నా భుజంమీది ఆయన చేతిని తీసివేస్తూ.

"అదేం'?" అన్నారు ఆయన ఆశ్చర్యంగా.


"ఇవాళ పిల్లలు చీర కొనమంటే కొనిస్తారు. రేపు పిల్లలు అమ్మని ఇంట్లోనుంచి వెళ్ళగొట్టమంటే ఆ పని చెయ్యరని నమ్మకమేమిటి?" అన్నాను నేను బాధగా.

నా కళ్ళల్లోంచి నీళ్ళు బుగ్గలమీదుగా కిందికి జారాయి.

"పిచ్చి పిల్లా?" ఆయన నా చేతిని తన చేతిలోకి తీసుకుంటూ అన్నారు. 'చీర కొనాలని రాత్రే నిశ్చయించుకున్నాను. కానీ - మరి నువ్వు నాతో మాట్లాడడం లేదుగదా? ఈ విషయం నీకు తెలియజేసేది ఎట్లా?' అందుకే మధ్యలో ఈ పిల్లలతో డ్రామా అంత" అన్నారు నవ్వుతూ.

క్షణంలో మబ్బులు తొలగి ఆకాశం తేటగా అయినట్లు అయింది.

"ఇక కోపతాపాలన్నీ పక్కకు నెట్టేసి, త్వరగా వంట కానిచ్చి, రెడీ అవు" అని ఆయన అనడంతో, 'ఎంతయినా ఆయనకు నేనంటే చాలా ప్రేమ!"అని పదేపదే అనుకుంటూ సంతోషంతో




ఉప్పొంగిన మనస్సుతో చకచకా పనులు కానివ్వసాగాను.

** ** **

ఆరోజున నేను మనసుపడ్డ చీర అందిన సంతోషంతో, రెట్టింపు ఉత్సాహంతో పుట్టినరోజ సరదాగా జరుపుకున్నాను.

** ** **

ఈయన ఆఫీసుకు, పిల్లలు స్కూళ్ళకు వెళ్ళేందుకు రెడీ అయ్యారు. టిఫిన్ బాక్సులు

సర్దడంతో హడావిడిగా ఉన్న నేను, "లల్లీ" అంటూ ఈయన గట్టిగా అరవడంతో, 'బాబోయ్ ఏం ముంచుకువచ్చిందో?" అనుకుంటూ పరిగెత్తుకు వచ్చాను వంటగదినుంచి.

అప్పటికే ఇస్త్రీ ప్యాంటు, షర్ట్ వేసుకున్న అయన." నా పర్స్, పాకెట్ కోంబ్ ఏవీ?" అన్నారు.

చకచకా తీసి ఇచ్చాను.

"కనీసం ఇవాళ అయినా 'అది' ఉందా? అన్నారు వ్యంగ్యంగా.

నా ముఖం తెల్లగా పాలిపోయింది. గబగబా బట్టల మధ్య వెతకసాగాను ఉహూఁ - ఉంటేగా?

"ఎన్నిసార్లు చెప్పినా నరే? కనీసం ఒక క్లాత్ కొని కుట్టించమన్నా వినవు" ప్రతీరోజూ ముఖం తుడుచుకుందామని జేబులో చెయ్యి పెడితే జేబులు ఖాళీ. ఇన్నేళ్ళనుంచి చేస్తున్నావు కాపురం. ఆ మాత్రం జ్ఞావకం లేకపోతే ఎలా? ఆ మల్హోత్ర గాడి మిసెస్‌ను చూసి అయినా తెచ్చుకో. బుద్ధి? ప్రతిరోజూ శుభ్రంగా ఇస్త్రీ మడతలతో ఇస్తుంది"

నాకు కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి.

వాళ్ళ నాన్న ఉగ్రరూపాన్ని చూసిన పిల్లలు, భయంతో నిశ్శబ్దంగా నిలబడిపోయారు.

ఇంతలోనే చప్పున గుర్తుకువచ్చింది. వెంటనే బీరువా తెరిచి నా హ్యాండ్ బ్యాగ్ తీశాను. నిన్న సాయంత్రం బజారుకు వెళ్ళేటప్పుడు అందులో పెట్టుకున్నాను. నా పరువు దక్కించినందుకు ధన్యవాదాలు చెప్పుకుంటూ, అది తీసి ఆయనకు అందించాను.

జేబులో పెట్టుకుని, విసురుగ్గా బయటికి నడిచారు ఆయన.

'ఈసారి బజారుకి వెళ్ళినప్పుడు మరచిపోకుండా ఒక డజను కొనుక్కురావాలి' అనుకుంటూ నీరసంగా లోపలికి నడిచాను.

** ** **

ఆయన ఆఫీసుకీ, పిల్లలు స్కూళ్ళకీ వెళ్ళిపోవడంతో ఇల్లంతా సద్దుమణిగింది.

నా స్నానం కానిచ్చి, భోజనం ముగించి, తాంబూలం బుగ్గనపెట్టుకుని తీరికగా బీరువా తలుపు తెరిచాను.

ఒక అరనిండా నా చీరలే. చక్కగా మడతలు పెట్టి ఉన్నాయి. చీరల మడతల మధ్యనుంచి, ఇవతలికి తీశాను పర్స్.

## అందుకే

"నీవు, నీ భార్య అలా ప్రతి రోజూ గొడవలు పడేబదులు రాజీకి వస్తే బావుంటుందిగా?"

"నేను అదే అంటున్నా !"

"మీ ఆవిడ ఒప్పుకోదా?"

"అందుకే ప్రతి రోజూ ఈ గొడవ !"

-కె. వి. మధుసూదనరావు [కాకినాడ]

జిప్ లాగగానే పిల్లా-పాపా కలిగిన సంసారంలాగా, చిల్లర్లతో, రూపాయల నోట్లతో బిలబిలమంటూ వలకరించింది ధనలక్ష్మి.

అవి నా బ్లాక్‌మనీ. ఈయన ఇంటి ఖర్చులకు అంటూ ఇచ్చే డబ్బులో కొంత దాచేస్తూ ఉంటాను. కొంత డబ్బు పోగు అయ్యాక, ఏ చీరో, లేదా ఏ వెండి, బంగారపు వస్తువో కొంటూ ఉంటాను.

చాలా సందర్భాల్లో చీరల కోసమే ఆ డబ్బు, వెచ్చించవలసి వస్తుంది. అందుకు ఒక కారణం. చీరలపైన మోజు కావచ్చుగానీ, అదే పూర్తి కారణంకాదు.

ఎందుకంటే - నెలకు ఒకసారి ఇంటిముందుకు జరీ, సిల్కు చీరెల మూటలవాడు వస్తూ ఉంటాడు. ఖరీదైన చీరలను ఇన్‌స్టాల్‌మెంటు పద్ధతిలో ఇస్తూ ఉంటాడు.

అతను తెచ్చే చీరలు కూడా నాణ్యమైనవే కావడంతో మా వీధిలో ఆడవాళ్ళమందరం అతని చుట్టూ మూగి, అతని చీరల మూటను నిముషంలో ఖాళీ చేసేస్తాం.

ఆడవారికి వారు ధరించే చీరలు, నగల మూలానే సాటి ఆడవారిలో విలువ పెరుగుతుందని నమ్ముతాను నేను. అందమైన చీరలు చుట్టుపక్కలవారికి ఆకర్షణీయంగా కన్పించడమే కాకుండా, కట్టుకున్న వారి అందాన్ని ఇనుమడింపజేసి వారిలో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తాయని నా అభిప్రాయం.

అందుకే - నా కన్ను పడిన ప్రతి అందమైన చీరనూ కలెక్ట్ చేసి, నా 'బఈరువా' అనే మ్యూజియంలో పదిలపరుస్తూ ఉంటాను నేను. నా శరీరాకృతి కూడా చీర అందంతో పోటీ పడడంతో నేను కట్టుకున ప్రతిచీరా రెట్టింపు అందాన్ని సంతరించుకుని పదిమందిలో సంచలనాన్ని సృష్టిస్తుంది.

బజారులో నడుస్తున్న నన్ను ఆపి, "మీ చీర చాలా బాగుందండీ" ఏ షాపులో కొన్నారు? అంటూ కొందరు ఆడవాళ్ళు అడిగిన సంఘటనలు కూడా అరుదుగా లేకపోలేదు.

మగవాళ్ళు ఎటువంటి బట్టలు వేసుకున్నా పట్టించుకోరు? వారికి మర్యాదలు హోదానిబట్టేగాని, వేసుకునే బట్టలను బట్టి ఉండవు. ఆడవాళ్ళకే ఈ జాడ్యం అంతా!

పర్సులో దాచిన నోట్లూ, చిల్లర డబ్బులూ అన్నీ కలిపితే మొత్తం మూడు వందలు అయ్యాయి. అయిదు వందల రూపాయలు ఖరీదు చేసే ఒక గద్వాల్ చీర చూపించాడు మొన్న చీరలవాడు. ఈసారి ఆ చీర కొనుక్కుంటేనో?

పాపం! ఈయన కొత్తబట్టలు కొనుక్కుని చాలాకాలం అయింది అక్కడక్కడా చిరిగిన వాటినే టైలర్‌చేత కుట్టించుకుని, అవే వాడతారుగానీ, కొత్తబట్టలు కొనుక్కొందుకు ఇష్టపడరు.

ఎప్పుడైనా తను - "బట్టలన్నీ పాడయ్యాయి. కొత్తవి కొనుక్కోండి" అంటే. "ప్రతీ నెలా వచ్చే జీతం ఇంటి ఖర్చులకే చాలడంలేదు. ఒక్క రూపాయి దాచాలన్నా దేవుడు కనిపిస్తున్నాడు. ఇక కొత్తబట్టలు ఎక్కడినుంచి కొనుక్కుంటాం?" అంటూ ఉపన్యాసం ఇస్తారు ఆయన.

ఎల్లుండి ఈయన పుట్టినరోజు. ఈ మూడు వందలతో కొత్తబట్టలు కొని ఆయనకు 'సర్ప్రైజ్ గిఫ్టగా' ఇస్తేనో?


బాగుంటుంది! మొదట ఆశ్చర్యంగా చూసి, ఆ తర్వాత ఆనందం అలుముకున్న ముఖంతో "నాకెందుకోయ్ ఇప్పుడు కొత్త బట్టలు? ఆ డబ్బుతో నువ్వొక చీర కొనుక్కోకపోయావా?" అంటున్న ఆయన ముఖం నా కళ్ళముందు కదలాడింది?


వెంటనే స్థిర నిశ్చయం చేసుకున్నాను. రేపు తప్పనిసరిగా షాపుకి వెళ్ళవలసిందే!

** ** **

షాపుకి వెళ్ళేందుకు రెడీ అయి ఇంటికి తాళం వేస్తుండగా, ఎక్కడినుంచో ఊడిపడింది మా ఎదురింటి అరుంధతి.

"వదినగారూ! ఎటో వెళుతున్నట్లున్నారు.



చీరల అతను వచ్చాడు. ఈసారి ఎంత మంచి రంగులు తెచ్చాడనుకున్నారు?" అంది సంబరంతో ముఖం చాటంత చేసుకుని.

'ఇప్పుడే అలా షాపుకి వెళ్ళొస్తాను వదినగారూ? అయినా - ఈసారి చీర కొనే ఉద్దేశం లేదు నాకు" అన్నాను - అటువైపు మళ్ళమంటూ ఒత్తిడి చేస్తున్న మనస్సును చిక్కబట్టుకుంటూ.

"క్రితం సారి - చిలకపచ్చ జరీ గద్వాల్ చీర తెమ్మని అడిగినట్లున్నారు మీరు. అది తెచ్చాడు. అదే రకంలో ఇంకా ఎంత అందమైన రంగులు ఉన్నాయనుకున్నారూ? మేమంత ఈసారి అవే సెలెక్ట్ చేసుకున్నాం. మీరుకూడా, తీసుకోకపోతే మానె, ఒక 'చూపు' విసిరి వెళ్ళకూడదూ?" అంది ఆవిడ నన్ను 'టెంప్ట్' చేస్తున్న పద్ధతిలో.

నా మనస్సు పూర్తిగా లొంగిపోవడంతో, నా ప్రమేయం లేకుండానే నేను ఆవిడ వెనకాలే, ఆవిడ ఇంటివైపు అడుగులు వేశాను.

మరి కాస్సేపటికి ఎంతోకాలంనుండీ ఆశపడిన చిలకపచ్చ జరీగద్వాల్ చీర నా స్వంతమైంది.

ఈసారి అయినా ఈయనకు బట్టలు కొనాలి ' అనుకున్నాను నిట్టూరుస్తూ.

** ** **

"అన్నాలకి పిలుస్తుంటే రాకుండా ఏం చేస్తున్నారర్రా పిల్లలూ " అంటూ పిల్ల గదిలోకి నడిచిన నేను, నాళ్ళు వాళ్ళ కిడ్డీ బ్యాంక్ డబ్బాలు తెరిచి, డబ్బులు లెక్కపెడుతూ ఉండడం చూసి, "ఇంకా పూర్తిగా నిండకుండానే ఎందుకు డబ్బులు తీసేస్తున్నారూ?" అంటూ కేకలు వేశాను.

"అదంత సీక్రెట్ మమ్మీ! సాయంత్రం నీకే తెలుస్తుందిగా " అన్నాడు మావాడు సి.ఐ.డి. ఫోజులో.

"మీ ఇష్టం. ఈ నాన్నని మీకు పాకెట్ మనీ ఇవ్వద్దని చెబితే వినరు? రెండు రోజులు తిన్నగా అందులో దాస్తారో లేదో - మూడవరోజు తీసివేసి ఖర్చు చేస్తారు. "ఈ పిల్లలకి పొదుపు ఎలా తెలుస్తుందో ఏమిటో!" అని విసుక్కుంటూ

## చూపిస్తా

భార్యపైన ప్రేమకు గుర్తుగా షాజహాన్ తాజమహల్ కట్టించాడు. మరి మన ప్రేమకి గుర్తుగా ఏం చేయాలను కుంటున్నారు" అని భర్తని అడిగింది సుబ్బలక్ష్మి.

"ఆ షాజహాన్ కట్టించిన తాజ్‌మహల్‌ను మన ప్రేమకు గుర్తుగా ఒకసారి నీకు చూపించాలనుకుంటున్నాను డార్లింగ్" అన్నాడు ఆ భర్త.

శోభనాద్రీశ్వర్
[అమ్మపాలెం]

వంటగదిలోకి వెళ్ళిపోయాను నేను.

ఇవాళ ఆయన పుట్టినరోజు అవడంతో మామూలు వంటతోపాటుగా పాయసం కూడా చేశాను. సాయంత్రం ఏ పకోడీలో చేస్తే సరి అనుకున్నాను.

హాయిగా షాంపూ చేసుకుని, పాయసంతో నోరు తీపి చేసుకుని మా అందరినుంచి 'హ్యాపీ బర్త్‌డే విషెస్' అందుకుని ఆఫీసుకు వెళ్ళారు ఈయన.

మధ్యాహ్నం భోజనం ముగించుకుని, పకోడీలు చేసేలోగా ఈయన, పిల్లలు ఇంటికి తిరిగి వచ్చేశారు.

ఈయన డ్రాయింగ్ రూమ్‌లో సోఫాలో కూర్చొని షూస్ విప్పుకుంటున్నారు.

గ్లాసుతో చల్లటి మంచినీళ్ళు తెచ్చి అందించాను.

ఇంతలో పిల్లలు ఇద్దరూ కూడబలుక్కుని, వాళ్ళ స్కూలు బ్యాగ్‌లో దాచిన అందమైన కాగితంతో ప్యాక్ చేసి ఉన్న ప్యాకెట్ తెచ్చి, వాళ్ళ నాన్న చేతిలో పెట్టి "విష్‌యూ హ్యాపీ బర్త్‌డే డాడీ" అన్నారు.

"అరె! ఏమిటిది?" అన్నారు ఆయన ఆశ్చర్యంగా చూస్తూ.

"తెరచి చూడండి డాడీ," అన్నారు పిల్లలు ఇద్దరూ కోరస్‌గా.

పైన ఉన్న గిఫ్ట్ రేపర్‌ని చించేసి, లోపలి అట్టపెట్టె తెరచి చూసిన ఆయన ముఖం ఆశ్చర్యానందాలతో విచ్చుకోవడం చూసిన నేను 'ఏమిటా అది" అని తొంగి చూశాను.

అవి కర్చీఫ్‌లు. అందమైన డిజైనులున్న రంగురంగుల రుమాళ్ళు మొత్తం డజను ప్లాస్టిక్ కవర్ వెనుకనుంచి ఊరిస్తున్నట్లుగా చూస్తున్నాయి.

"ఇటువంటి గిఫ్ట్ ఇస్తున్నందుకు ఏమీ అనుకోకండి డాడీ. ఆఫీసుకు వెళ్ళేముందు మీకు, అమ్మకీ ప్రతీరోజూ జేబురుమాలు గురించి తగవులాటే? అమ్మ రుమాళ్ళగురించి పట్టించుకోదు. మీకు జేబులో రుమాలు లేకపోతే తోచదు? అందుకే ఈసారి మా పాకెట్ మనీతో ఈ కర్చీఫ్‌లు కొన్నాం. డాడీ చాలా అందంగా, ముద్దుగా ఉన్నాయి కదూ?" అన్నారు పాపా, బాబూ.

ఆయన సంతోషంతో పిల్లలిద్దరినీ దగ్గరకు తీసుకుని, కళ్ళలో నీళ్ళు తిరుగుతూ ఉండగా, "థాంక్యూ చిల్డ్రన్! నాకు చాలా అందమైన, ఉపయోగకరమైన గిఫ్ట్ ఇచ్చారు మీరు. వీటిని జాగ్రత్తగా వాడుకుంటాను. - అన్నారు.

సిగ్గుతో తలవంచుకున్నాను నేను. నా పుట్టిన రోజు నాడు - బీరువానిండా చీరలు మూలుగుతూ ఉన్నా కూడా - ఆయన కనీసావసరాలు తీర్చాలని కూడా ఆశించకుండా - గొడవ చేసి కొత్త చీర కొనిపించుకున్నాను. ఆయన పుట్టినరోజు వస్తే - ఆయనకు సరైన బట్టలు లేవని తెలిసి కూడా నా స్వార్థం నేను చూసుకుని, ఆయనను నిర్లక్ష్యం చేశాను.

నాకంటే వయస్సులో ఎంతో చిన్నవాళ్ళయినా, విచక్షణతో నాకంటే రెట్టింపు వికసించిన మనసున్న నా పిల్లలముందు, నాకు నేనే అల్పురాలిలా, దోషిలా అనిపించడంతో, సిగ్గుతో తలవంచేశాను. ✱

## మనసే మోక్షము సుఖమనోహరం

-కె.గోదావరి శర్మ

పతనం పదార్థ లక్షణం
ఉద్ధరణ హృదయ ధర్మం.

పాంచభౌతిక శరీరమూ
శరీరంతో జీవించే జీవితమూ
పతనం చెందడం సహజమని
తెలుసుకోవడమే పదార్థజ్ఞానం
బోధి వృక్షం రాల్చిన పండుటాకులు
బుద్ధుడికి జ్ఞానాన్నిచ్చాయి.
న్యూటన్ తలపై పడిన ఏపిల్
గురుత్వాకర్షణ పాఠాన్ని బోధించింది.
ప్రకృతి సర్వం పురుషోత్తముడితో
'తవ చరణే పతితాహం' అంటుంది.

కాని, శరీర పంజరంలో బందీ అయిన
పిచిక మనసు చూపంతా ఆకాశం మీదే.
మెరుపు కళ్ళతో, ఉప్పొంగే హృదయంతో
చంద్రుడికేసి చేతులుసాచే సముద్రంలా,
నింగికురిసే ఎండ, వానలకి

పూలబహుమతులతో బదులిచ్చే మొక్కలా,
అగ్నికి ఆహుతి అవుతూ కూడా
పరిమళంగా ఉత్పతనం చెందే కర్పూరంలా,
భూమికి కట్టుబానిసత్వం వదిలి
ఉద్ యోగంకోసం కలలు కంటుంది.

ఎదకీ పదార్థానికీ

ఎడతెగని వైరం -
ఎద్దు ఎండకీ
ఎనుబోతు నీడకీ లాగినట్టు!
ఎలా సాధ్యం
మనశ్శరీరాల మధ్య సయోధ్య?

మానవమేధ
త్రిశంకు స్వర్గాన్ని సృష్టించింది.
ప్రేమతో, కళతో, సంగీతంతో
మనిషి అస్తిత్వాని సంస్కరించింది.
అనమాన ప్రతిభతో
రసమయ జగతిని ఓలలాడించింది.
అలలుగా సాగే
సౌందర్య ప్రవాహంలో ఈదుతూ
ప్లవన సూత్రాల సహాయంతో
గురుత్వాకర్షణని ధిక్కరించి
ఇహపరాలు రెండూ
ఇక్కడే సాధించింది.